# శిల్పి

## రాజేశ్వరి

*కల్ల నిజాన్ని ఆశ్రయిస్తుంది. కల్పనకూ నిజమే నెలవు. అయినా కల్పనకూ, వాస్తవానికీ ఎప్పుడూ పొత్తు కుదరదు. సంఘర్షణ సంభవించితే నిలిచేది నిజమే అయినా మధ్యలో నలిగేది మానవుడు.*

---

**నారాయణగఢ్** పురానికి ఆవతల సుమారు ఒకమైలు దూరంలో ప్రతి సంవత్సరం చాలా ఘనంగా జరిగే పండుగ ఈ సంవత్సరం కూడా నిర్విఘ్నంగా జరిగిపోయింది. నారాయణగఢ్ ఉత్తర దేశంలో ప్రసిద్ధి చెందిన ఊరు. ఆ ఊరి వెలుపల ఒక పెద్ద రావిచెట్టు. చెట్టు సమీపాన తామర పూలతో నిండిన ఒక కొలనూ, కొలను గట్టును ఆనుకొని దక్షిణంగా ఒక శిథిల గృహమూ కనుపిస్తాయి. ఆగృహానికి అరవైడెబ్బై గజాల దూరంలో ఒక శిలా ప్రతిమ ఆపాద మస్తకం దట్టమైన వస్త్రంతో కప్పబడి ఉంటుంది. స్థూల దృష్టికి అక్కడ కనుపించే దృశ్యాలివే. చెరువూ, చెట్టూ, కుటీరం, ప్రతిమా.

నారాయణగఢ్ జనులు ప్రతి సంవత్సరమూ ముసుగులో ప్రచ్ఛన్నంగా ఉన్న ఆ శిలా ప్రతిమకు పూజచేసి పెద్ద ఉత్సవం జరుపుతారు. శ్రీ జగన్నాథంలో జరిగే రథయాత్ర తరువాత మళ్ళీ



ఇదే ఆ ప్రాంతంలో పెద్ద ఉత్సవం. ఆ ఉత్సవం ముఖ్యంగా మూడు దినాలే జరుగుతుంది. మాఘ శుద్ధ సప్తమి సాయంత్రం మొదలు నవమినాటి సాయంత్రంవరకు. మొదటి దినం పూజలూ, సంతర్పణలూ జరిపి రాత్రి నాట్య ప్రదర్శన, సంగీత సభ అయాక తొమ్మిదిగంటల ప్రాంతంలో ముసుగుతీసి విగ్రహ స్వరూపాన్ని సందర్శిస్తారు. పది, పదిహేను నిమిషాలపాటు మాత్రమే దర్శన కాలపరిమితి. మళ్ళీ వెంటనే వస్త్రం పడి పోతుంది. ఆ కొద్ది క్షణాల్లో ఆ దివ్య మంగళ స్వరూపాన్ని చూడడానికి వేలాది జనులు అతి ప్రయాసతో ఎంతో దూరంనుంచి వస్తారు. మూడవ రోజు ప్రత్యేకం శిల్పాచార్యుల సన్మానం కోసం ఏర్పడింది. దేశ దేశాలనుండీ ఆహ్వానింప బడిన శిల్పులందరూ వచ్చి ఆ విగ్రహానికి నమస్కరించి, శిల్పశాస్త్రం గురించి చర్చలూ, ఉపన్యాసాలూ జరుపుకుంటారు. తరువాత నాటక ప్రదర్శనలూ, నాట్య ప్రదర్శనలూ యథావిధిగా జరుగుతాయి. ఈ ఉత్సవం అంతటికీ అయే ఖర్చు సుమారు లక్ష రూపాయలు.

ఆ ఉత్సవంలో తనంత తాను కల్పించుకొని ముఖ్యంగా ధన సహాయం చేస్తాడు మధుబాబు. ఆ పండుగ ఆరంభం ప్రతి సంవత్సరం వారి చేతి మీదుగానే జరగాలి. ఆ పండుగపై మధుబాబుకు ఉండే ప్రీతి, ఆ పురజనులకు వారియందుండే పూజ్య భావం అలాటివి. మధుబాబుది ఆ ఊరు కాదు. నారాయణగఢ్‌కు ఆరువందల మైళ్ళ దూరంలో ఉండే ఒక ఊరికి జమీందారు అతను. పాశ్చాత్య విద్యలతోపాటు దేశ భాషలను కూడా చక్కగా చదువుకున్నవాడు. వితరణపరుడు. లలిత కళల్ని చక్కగా పోషిస్తాడు. అతని ఏకైక పుత్రిక జ్యోతి ప్రతి సంవత్సరమూ మధుబాబుతో కూడా ఈ ఉత్సవానికి వస్తుంది. చిన్నతనంలో తల్లి పోవడంచేత మధుబాబు జ్యోతిని చాలా గారాబంగా పెంచుతూ వచ్చాడు. తండ్రీ కూతు ళ్ళిద్దరూ ఎప్పుడూ సంగీతశాస్త్రం గురించి చర్చిస్తూ ఉంటారు. మధుబాబు తాను స్వయంగా ఎన్నో పాటలు వ్రాసి రాగాలను కూర్చినవాడు. జ్యోతి గురువులు చెప్పిన పాటలు పాడుతూంటే, మధుబాబు రాగాలను దిద్ది లోపాలను సర్దుతాడు. జ్యోతి సుశిక్షితమైన విద్యావతి కావాలని అతని ఆశయం.

ఆనాడు నారాయణగఢ్‌లో మూడవనాటి ఉత్సవం కూడా దిగ్విజయంగా జరిగిపోయింది. సాయంత్రం ఆరు గంటలకు పండుగంతా ముగిసి పోయింది. ఎవరి ప్రాంతానికి వారు బయలుదేరి పోగా మిగిలినవాళ్ళు ఊళ్ళోకి వెళ్ళిపోయారు. మధుబాబు జ్యోతితో కూడా తన ఊరు బయలు దేరాడు. పురజనులంతా ఆయనను సత్కరించి, కృతజ్ఞతా సూచకంగా చాలా దూరం సాగ నంపారు. మధుబాబు, జ్యోతి కారు ఎక్కారు. రాత్రి తొమ్మిది గంటలవేళ కారు ఉత్సవంజరిగిన ప్రాంతానికి కనుచూపు దూరంనుంచి పోతూంది. జ్యోతి పరిసరాలన్నీ కలయ చూసింది, ఆశ్చర్యంగా. "నాన్నా! ఆ ప్రాంతంలో వేలాది వేలజను లతో ఉత్సవం సాయంత్రం ఆరు గంటలవరకూ జరుగుతూనే ఉంది. ఇప్పుడు తొమ్మిది గంటలు మాత్రమే అయింది కదా? అప్పుడే ఆ పరిసరాలన్నీ నిర్మానుష్యమై, ఒక దీపమైనా లేకుండా పాడుపడినట్లున్నా యేమి?" అన్నది.

"అవునమ్మా! సంవత్సరంలో పండుగ జరిగే మూడునాళ్ళూ తప్ప మరెప్పుడూ అక్కడ మనుష్య సంచారం ఉండదు."

* * * *

"ఏం, నాన్నా?"

"నిన్న పగలం అంతా తిరిగి పండగ చేసిన చోట, తామర పూవుల కొలనూ, ఒక శిథిల గృహం చూచేవు కదూ? ఆ ప్రాంతానికి చుట్టూ నాలుగైదు ఫర్లాంగుల దూరంవరకూ పగలు కాని, రాత్రికాని మనుష్య సంచారం ఉండ దమ్మా, ఒక్క ఈ ఉత్సవం జరిగే సమయంలో తప్ప. అందుకే సాయంత్రం పండగ ముగియ గానే ఎక్కడివాళ్ళు అక్కడ మాయ మయ్యారు."

"ఏం నాన్నా? అక్కడ దేవతలా? దయ్యాలా! ఎవరున్నారు?"

"ఏమో, తల్లీ! దయ్యాల సంగతి తెలియదు కాని, అక్కడ ఒక దేవత మాత్రం నిశ్చయంగా ఉంది. ఆ దేవి విగ్రహానికే నిన్న మనం చేసిన పండుగంతా. ఆ పురజనుల శాంతికి ఆవిడ అనుగ్రహమే కారణం. ఆ విగ్రహం వెలసిన దగ్గర్నుంచీ ప్రతి సంవత్సరం దాని ఆరాధన యిలాగే జరుగుతూంది. అదంతా ఒక పెద్ద గాథలే, అమ్మా!"

"అదేమో చెప్పు, నాన్నా!"

సంధ్య వెన్నెల్లో కారు నెమ్మదిగా సాగు తూంది. ఆకాశం నిర్మలంగా ఉంది. అక్కడక్కడ తెల్లని మేఘాలు దూదిపింజల్లా పరుగెత్తిపోతున్నాయి. వెన్నెల్లో, కొండ కోనల్లో కారు మలుపులు తిరిగి పరుగెత్తుతూంటే జ్యోతి దేవకన్యలా మెరసిపోయింది. ఆమె ప్రకృతిలో పూర్తిగా లీనమైపోయింది. మనసులో హత్తుకుపోయిన నారాయణగఢ్ పండుగ విశేషాలు మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వస్తున్నాయి. ఆ చలువరాతి విగ్రహాన్ని చూడడానికి వచ్చిన జనసమూహమూ, ఆ శిల్ప చాతుర్యాన్ని మెచ్చుకొనే కళాకారుల వాక్కులూ, అన్నీ ఆమె హృదయానికి హత్తుకుపోయాయి.

"నాన్నా! అంత అందమైన విగ్రహానికి ముసుగువేసి ఆ నిర్జన ప్రదేశంలో వదిలేశారు గదా? దానిని ఎవ్వరూ ఎత్తుకుపోరూ?" అన్నది జ్యోతి.

"ఎత్తుకుపోరమ్మా! అసలా ప్రాంతాల్లో మనుష్యులు అడుగుపెట్టడానికే జంకుతారు. అదీకాక ఆ విగ్రహం అక్కడ ఏనాడో అతుక్కుపోయింది. ఎందరు కదపడానికి ప్రయత్నించినా కదలలేదు" అన్నాడు మధుబాబు.

"ఎందుకు అతుక్కుపోయింది? ఎవరు దానిని

సంక్రాంతి
పండుగ సందర్భంలో
ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక
అభిమాన పాఠకులకు
శుభాభివందనలు
—ఎడిటర్

కనపడుటలేదు



పేరు బి. పుల్లయ్య.

P. U. C. తప్పి నందున ఇల్లు విడిచి 11-6-62న వెడలి పోయినాడు. ఇతని తండ్రి బి. సుబ్బరావు, హుజూరు సిరస్తారు, కలెక్టరు ఆఫీసు, అనంతపురము, చింతతో వ్యాకులతపడుచున్నాడు. ఇతని జాడ తెల్పినను లేదా కుదురున పిల్లవానిని అప్పగించినను తగురీతిని ఖర్చులతో బహుకరింపబడును.


ఇట్లు,
బి. సూర్యప్రకాశరావు,
టీచరు, హైస్కూలు,
ఉరవకొండ, Via-గుంతకల్లు.

చేసేరు? ఆ దేవత ఎవరు? అంతా చెప్పు, నాన్నా. వినాలని చాలా కుతూహలంగా ఉంది."

"చూడు, జ్యోతీ! నిన్న మనం శిల్పి ఇంటికి బహుమతు లిచ్చేము. ఆ గృహమూ, చెరువుతో సహా ఆ ప్రాంతమూ, అంతా పూర్వ మొక కళాకారుని ప్రాంగణం అన్నమాట. అత డొక అఖండ కళా జ్యోతి.

బండరాళ్ళ గుండెల్లో రసంచిలికి నవరస మూర్తులను నిర్మించే శిల్పాచార్యుడు. రాళ్ళతో మానవులనే కాదు, దేవతలను కూడా సృష్టించేడు.

నేను ఉన్నత విద్యకోసం కలకత్తాలో ఉన్న రోజులవి. ఇప్పటికి చాలా సంవత్సరాల క్రిందటి



అవంతిపురం శిథిలాలు (కాశ్మీరు)        ఫోటో—ఎస్. ఆర్. గ్రోవర్ (రాజాతర్)

మాట. అప్పటికే ఆ శిల్పి వృద్ధుడు. ఆజన్మ బ్రహ్మచారి. తన యౌవనాంత దశలో శిల్పకళా వధూటి చరణదాస్యానికి అంకితమైపోయింది అతని సర్వస్వం. వాడు తన జీవితంలో ఒక మహా సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. యథేచ్ఛగా పాలించుకున్నాడు. అతని గృహం అంతా—పైకప్పు, గోడలు, నేల — రాతి మయమే. ఇంట్లో వాడుకునే ప్రతి వస్తువూ శిలా నిర్మితమే. ఆ యింటికి అవతల ఎంత ఉందో లోపలి భాగం అంత ఉంది. ఆ రెండు భాగాలూ రెండు లోకాలు. పై అవరణంతా దుర్భేద్యమైన రాతి ప్రహరీతో మహోన్నతంగా ఉండేది. ప్రహరీలో ఎన్నో విగ్రహాలు అనేక భంగిమల్లో ఉండేవి. ఆ బొమ్మల ఆకృతులలోనే

# శిల్పి

కాదు, రంగులో కూడా వైవిధ్యం కనిపిస్తుంది. ఎక్కడ తెచ్చేవాడో రంగు రంగుల రాళ్ళు—నల్లరాయి, ఎర్రరాయి, పాలరాయి, పచ్చల రాయి, సిందురాయి, ముద్దరాయి — అవన్నీ అతని చేయి తగిలేటప్పటికి తమ తమ స్వభావ సిద్ధమైన రంగుల్లో, యిచ్చవచ్చిన రూపాల్లో తయారై నిలిచేవి. అయినా ఆ శిల్పి తన పని ముట్లతో వాటికి నిరంతరమూ శిక్షణయిస్తూనే ఉండేవాడు. ప్రహరీలో ఉంచిన వస్తువులన్నీ అమ్మకానికి. వస్తువులు కొనదలచినవాడు తప్ప ఇతరులు అందులోకి రాకూడదు. ఆ కొనే వాడైనా మొత్తంవరిగా మూడు మాటల్లో వచ్చిన వస్తువుకు చెప్పిన మూల్యం ఇచ్చి కొనుక్కుపోవలసిందే.

ఇవికాక లోపలి భాగంలో ఇంకా ఎన్నో ఉన్నాయి. అవన్నీ తన స్వంతాలు. వాటిని అమ్మడు. సరికదా, ఎవరూ చూడడానికి కూడా వీల్లేదు. అందులో తన భార్య ఉంది, ప్రియురాలు ఉంది, తల్లిదండ్రులూ, కూతుళ్ళూ, కొడుకులూ, మనుమలూ, బంధువులూ, దాసదాసీలూ అంతా ఉన్నారు. కొందరితో ఆడతాడు, కొందరితో పాడతాడు, కొందరితో నవ్వుతాడు, కొందరికి భక్తితో ప్రణామం చేస్తాడు, కొందర్ని దండిస్తాడు, కొందర్ని లాలిస్తాడు, కొందర్ని పాలిస్తాడు. నవరసభరితుడై ఆ రాళ్ళతో మహా సామ్రాజ్యాన్ని ఏలుకొంటాడు. ఆ కుటుంబ వ్యవహారాల్లో అతని కెప్పుడూ తీరిక ఉండేది కాదు.

ఇక బయట ప్రహరీలో ఒక అంగుళం ఎత్తు మొదలుకొని ఆరు అడుగులవరకూ తయారు చేసిపెట్టిన విగ్రహాలు శతాధికంగా అమ్ముడు పోతూనే ఉన్నాయి. కొందరు పిల్లల ఆటలకోసం చిన్న చిన్న బొమ్మలను కొనుక్కుపోతారు. కొందరు కొన్ని విగ్రహాలను దేవతా గృహాల్లో ప్రతిష్ఠించి పూజించుకొంటారు. కొందరు కొన్ని రమ్యమైన ఆకృతులను తమ అభ్యంతర మందిరాల్లో అమర్చి ఆసౌందర్యాన్ని ఆరాధిస్తారు. కొన్ని వింత భంగిమల్లో ఉన్న విగ్రహాలను ఎంచి కొందరు ఉద్యానవన మధ్య భాగాల్లో అమరుస్తారు. కొందరు కొన్ని రమ్యమయిన ఆకృతులను దూర దేశాల్లో ఉన్న ఆత్మీయులకు కానుకలుగా పంపుకుంటారు. ఏవ రెలాటి దృష్టితో కొన్నా, మన శిల్పాచార్యుడు వాటిని తయారుచేసే దృష్టి ఒక్కటే. అతనికి ఇతరుల భావాలతో ప్రమేయం లేదు; చెయ్యడం, అమ్మడం తప్ప. వస్తువు అమ్మతున్నప్పుడు తప్ప తాను ఏ వ్యక్తినీ పలుకరించడు. ఎవ్వరూ లోపలికి రావడానికి సాహసించరు, ఒక్క బాలిక తప్ప. ఆ ప్రాంతంలో ఉన్న ఆచార్యుని తనయ, కలిక అనే అమ్మాయి మాత్రం అప్పుడప్పుడు అతని గృహంలో జొరబడుతుంది. శిల్పి ఆమె రాకను అభ్యంతర పెట్టడు. ఆ బాలిక పాలబుగ్గల మిసిమిసి, కోమలత్వాన్ని అద్దే శక్తి ఆ శిల్పికే కాదు, ఈ లోకంలో ఎవరికీ కూడా లేదేమో! పాషాణాల్లో దాగివున్న సౌందర్యాన్ని ఆకళించుకొనే శిల్పి ఈ పసిపాప చరణాల్లో పులకించిపోయేడో ఏమో? ఎప్పుడూ ఆ బాలిక రాకని అడ్డలేదు. ఆమె కాలి మువ్వల సవ్వడి సర్వ సమ్మోహనంగా ఉండేది. అప్పటికి కలిక పది సంవత్సరాల బాలిక. చాలాసార్లు యథేచ్ఛగా వస్తూ పోతూ వుండేది. శిల్పి కుటుంబికు లందరితోనూ మాట్లాడేది, అందరినీ పలుకరించేది, యోగ క్షేమాలు అడిగేది. ఒకనాడు బాలిక పలుకరింపులు విని, శిల్పి 'ఈ రాళ్ళ భాష ఎప్పుడు నేర్చుకొన్నావమ్మా?' అని అడిగాడు. 'అప్పుడే మరచిపోయావా?' అంది, జంకు గొంకు లేకుండా. శిల్పి చకితుడయ్యాడు. కలికని నిదానించి చూచాడు. కలిక కిలకిలా నవ్వి వెళ్ళిపోయింది. 'కొంటె పిల్ల మాటలు' అని తన్ను తాను సముదాయించుకొన్నాడు. కలిక క్రమంగా పదమూడు సంవత్సరాల బాలిక అయింది.

శిల్పి రోజూ ఎక్కడికో వెళ్ళి సాయంత్రం అయేసరికి రాళ్ళు తెచ్చేవాడు. ఎక్కడికి వెళ్ళేవాడో, ఎలా తెచ్చేవాడో ఎవరికీ తెలియదు. తెలుసుకోవలసిన అవసరం కూడా ఎవరికీ లేకపోయింది. ఆ తెచ్చిన రాళ్ళు ప్రహరీ అవతల మర్రి చెట్టుక్రింద వేస్తాడు. ఆ సమ

యానికి సరిగ్గా కలిక వచ్చి, 'రాళ్ళు తెచ్చేవా?' అని పలుకరించి వెళ్ళిపోయేది. శిల్పి రాత్రి నిద్రలో ఏదో మాట్లాడుకునేవాడు. సగం రాత్రి అయాక లేచి కూర్చుంటాడు. దీపం వెలిగేది. ఏం చేసేవాడో తెలియదు. టిక్కు, టిక్కుమని సుత్తి దెబ్బల చప్పుడు మాత్రం ఆ ప్రాంతంలో వాళ్ళకి వినపడేది. ప్రొద్దుటే కలిక వస్తుంది. 'అప్పుడే రాత్రి తెచ్చిన రాళ్ళను మనుషుల్ని చేసేవూ!' అని ఉత్సాహంగా ఆ మాట్లా తిరిగి పలుకరించేది. శిల్పి నవ్వుతూ తలవంచుకొని పని చేసుకుంటూనే, 'అప్పుడే ఎక్కడ?' అనేవాడు. మళ్ళీ మర్నాడు కలిక వచ్చి నిలుస్తుంది. ఆ పూర్తి నిర్మాణాల్ని శిల్పి ఆమెకు చూపిస్తాడు. ఆమె ఒక బొమ్మలో చిరునవ్వు స్ఫుటంగా లేదంటుంది. ఒకదాని ఎత్తు చాలదంటుంది. అంతే కాదు. ఒకదాని వేళ్ళు యింకా సన్నగా ఉండాలనో, గోళ్ళు ఇంకా దిద్దాలనో, నడుము వంపు చాలదనో ఏదో ఒక వంక ప్రతి వస్తువుకీ చూపించేది. పాదాలూ, కను బొమ్మలూ కలిక దిద్దుబాటుల్లో సర్వ సాధారణాలు. అన్నీ శిల్పి శిరసావహించి, ఒక మహా గురువు ఆజ్ఞలా పాలించి దిద్దుకునేవాడు. అలా దిద్దుకునేటప్పుడు 'ఇవన్నీ శిల్పశాస్త్ర రహస్యాలు. వీటి లోతులు తెలుసుకునే ఆ బాలిక యీ లోపాల్ని చెబుతూందా? లేక కాకతాళీయంగా ఆమె మాటలు శిల్పశాస్త్రంలో కలుస్తున్నాయా!' అనే ఆలోచనలో పడేవాడు. ఒకప్పుడు ఆమె ఒక గురువులా కనిపించేది. ఒకప్పుడు చిలిపి పిల్లలా కనిపించేది. మొత్తంమీద ఒక్కొక్కప్పుడు అతని స్థితి 'కలయో, వైష్ణవ మాయయో' అన్నట్లుండేది.

ఒక రోజు కలిక మామూలుగా వచ్చింది. శిల్పి ఆమె రాకను గమనించలేదు. ఆమె ఒక క్రొత్త బొమ్మ చూచింది. వెంటనే ఆ బొమ్మ క్రింది పెదవికి ఎడమవైపు, ఒక చిన్న చుక్క కుదురుగా దిద్ది వెళ్ళిపోయింది. శిల్పి ఆ రోజు కలిక రాలేదనుకుంటూ, విగ్రహాన్ని చూచాడు. కొత్త సొంపు దానిలో కనిపించింది. చుక్క చూచాడు. అంత చిన్న మచ్చ మొత్తం స్వరూపానికి తెచ్చిన అందం ఏమంత తక్కువ కాదు. ఆ మచ్చమీద అతని మనస్సు లగ్నమై పోయింది. ఎలా ఉంటుందో చూద్దామని దానిని తుడిచి వేశాడు. విగ్రహంలో జీవకళ తగ్గిపోయినట్లయింది. మళ్ళీ ఆ చుక్క మరొక దగ్గరపెట్టి చూచాడు. మొదటి కళ రాలేదు. తెలుసుకున్నాడు శిల్ప కళలో ఇదొక రహస్యమని. మళ్ళీ మొదటి చోటే ఆ చుక్కని శాశ్వతంగా ఉండేటట్లు దిద్దాడు. ఏ కారణంచేతనయినా కలిక ఒక రోజు రాకపోతే శిల్పికార్యం అసంపూర్ణంగా నిలిచిపోతుంది. ఆ బాలిక నిర్ణయం అలాంటిది. ఆట పాటల వయస్సులో ఉన్న ఆ బాలిక చాలా చిలిపిగా ఎప్పుడూ శిల్పిని ఏవేవో ప్రశ్నలువేసి వేధించేది. 'ఇవన్నీఎలా చేస్తున్నావు?' అని అడిగేది. 'బుద్ధితో' అనేవాడు. 'ఏదీ బుద్ధి? చూపించూ' అనేది. తలమీద చెయ్యి వేసుకొని 'ఇందులో వుంది' అనేవాడు. అతని నెరసిన జుట్టు వ్రేళ్ళతో ఎత్తి, 'ఏది? బుద్ధి' అని వెతికేది. ఎన్నడూ ఆమె ఆడుకుందుకు బొమ్మ ఇమ్మని అతన్ని అడగలేదు. శిల్పి కూడా ఆమెకు ఎప్పుడూ ఏ వస్తువూ ఇయ్యనూలేదు. శిల్పి చేసిన నిర్మాణాల్ని చూడడం ఆమె కానందం. చూపించి ఆమె తీర్పుల్ని శిరసావహించడం అతనికి ఆనందం. ఇచ్చి పుచ్చుకోవడాలు వాళ్ళమధ్య లేవు. ఇద్దరిమధ్యా స్నేహం ఎంత వరకూ వెళ్ళిందంటే, ఒకరు రాకపోతే ఒకరు శాసిస్తారు. శిల్పి గృహానికి ప్రతి రోజూ ఏదో సమయంలో కలిక వస్తుంది. అప్పుడతను కొత్త వస్తువులు చూపించకపోతే అతన్ని సాధిస్తుంది. కలిక వచ్చి లోపాలు చెప్పక పోతే తన పని సగంలో నిలిచిపోయిందని అతడు కోపిస్తాడు. దోషులైన వాళ్ళు ఖిన్నులై పోతారు. బాలిక ఎక్కువగా కోపించినప్పుడు శిల్పి లోపల నవ్వుకుంటాడు. జాలి పడతాడు. సంతోషంతో అతని కళ్ళు ఆర్ద్రమౌతాయి. ఆ చిన్న పిల్ల విగ్రహాల్లో దోషాలు చూపించినప్పుడు, శిల్పి కంటికి ఆమె గురువులా కనిపిస్తుంది.

శిల్పి ఇంటిలోపలి భాగంలో ఒక చిన్న ప్రార్థనామందిరం కూడా ఉంది. అందులో అతడు ఏకాంతంగా ఎక్కువ కాలం గడుపుతాడు. అప్పుడప్పుడు ఏవో కొన్ని వస్తువులను ఆ గదిలోంచి మూటకట్టి తెచ్చి భద్రంగా కొలనిలో వేసేవాడు. ఎన్ని వస్తువులు అందులో పడితే ఆ మర్నాటికి అన్ని తామరపూలు పూస్తాయి. కలిక, ఆ పూలను అప్పుడప్పుడు లెక్కపెట్టేది. కాని వాటి గురించి ఎన్నడూ ఆమె శిల్పిని ప్రశ్నించనూ లేదు; అతడు చెప్పనూ లేదు. విగ్రహాలు చేస్తూ చేస్తూ, శిల్పి కొన్నిటిని విరిచి ముక్కలుచేసి కొలనిలో వేసేవాడు. కొన్నిటిని అతికేవాడు. కొన్నిటిని అక్కడక్కడ కోసేవాడు. ఇదంతా ఒక ఇంద్రజాలంలా ఉండేది. ఆ శిల్పకళా రహస్యాలు అనితరసాధ్యాలు.

కలిక మామూలుగా వచ్చింది. శిల్పి నాటి తన నిర్మాణాన్ని చూపాడు. కలిక చూస్తూనే పక్కున నవ్వింది. శిల్పి తెల్లబోయి లోపం చెప్పమన్నాడు. ఒక రకపు నాట్య భంగిమంలో ఉన్న ఆ ప్రతిమ అడుగు నాట్యశాస్త్రానికి విరుద్ధంగా ఉందని చెప్పి వెళ్ళిపోయింది. 'అబ్బో! నీకు నాట్యశాస్త్రం కూడా తెలుసా!' అని శిల్పి పరిహాసంగా సమాధాన మిచ్చి తనని తాను చేసుకున్నాడు. కాని రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. నాట్యశాస్త్రం తీసి చూచాడు. ముద్రల సంఖ్య చూచుకోవడంలో తాను పొరపాటు పడ్డాడని గ్రహించాడు.

కలిక పెద్దదవుతున్న కొద్దీ వాళ్ళిద్దరిలోనూ తరుచు భేదాభిప్రాయాలు వచ్చేవి. అవి అలా ఉండాలనే శిల్పి ఉద్దేశం కూడా. కాని అవి వాటంతటవే సమసిపోయేవి. ఈసారి మాత్రం కలికకు ఒక చిన్న కారణంచేత శిల్పితో భేదాభిప్రాయం రావడంవల్ల అతనిమీద విశ్వాసం తగ్గుతూ వచ్చింది. అది ఒక విగ్రహం విషయం. శిల్పి ఒక బొమ్మని ప్రార్థనామందిరంలో ముసుగు వేసి ఉంచాడు. అది ఆనాడు కలిక కంట పడిపోయింది. చేసిన ప్రతి వస్తువూ తనకు చూపిస్తాడు. సలహాలు అడుగుతాడు. కాని ఈ వస్తువు గురించి తనతో ఎన్నడూ ప్రస్తావించనైనా లేదు. ఎన్నాళ్ళనుంచి చేస్తున్నాడో, ఏయే వేళల్లో చేస్తున్నాడో తా నూహించలేకపోయింది. ఎప్పుడూ దానిని తన కంట పడనీయలేదతడు. కలిక చాలా ఆశ్చర్యపోయింది.



దేవదాసి (వెల్లూరు)
ఫోటో—వి. కే. కె. మూర్తి (మద్రాసు-11)

ఆమె హృదయంలో ఆవేశం, అనుమానం బయలుదేరాయి. శిల్పిని ఎన్నోసార్లు అడిగింది, ఆ విగ్రహాన్ని చూపెట్టమని. శిల్పి నేర్పుగా మాటల్లో విషయం తప్పించేవాడు. ఏ విధంగానూ ఆమె తన కోరికలో నెగ్గలేకపోయింది. ఒకనాడు ఆమె బాణంలా దూసుకు వెళ్ళి, ఆ విగ్రహం ముందు నించుని, దాని ముసుగు తీయడానికి సాహసించింది. ఇంతలో ఒక్క పరుగున శిల్పి వచ్చి ఆ విగ్రహాన్ని అదిమి పట్టుకొని కొలనులో దాన్ని పారేస్తానని బయలుదేరాడు. కలిక భయపడి కొలనులో పారేయవద్దని బ్రతిమాలి, ఇంకెప్పుడూ అలా చెయ్య

నని ప్రమాణం చేసింది. మళ్ళీ రెండు రోజులు పోయాక సాహసం చంపుకొని ఆ విగ్రహాన్ని చూపమని శిల్పిని అడిగింది. అతడు మౌనం వహించాడు. ఆమె కంపితురాలై ఆ ఇంటి కింక రానంది. ఆ మాట శిల్పి హృదయానికి శిలాఘాతంలా తగిలింది. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

'కళికా! సమయం వచ్చాక నీకు తప్పకుండా చూపిస్తాను. నా మాట నమ్ము. అదో దేవతా విగ్రహం. నువ్వు పుట్టడానికి ముప్ఫయి సంవత్సరాల ముందు మాట. నా చిన్నతనంలో నేను నిరంతరం సౌందర్యాన్వేషణ చేసేవాడిని. నే నాశించిన స్త్రీ సౌందర్యం ఎక్కడా చాలాకాలం వరకూ రాశీభూతంగా నాకు కనుపించలేదు. ఒకనాడు అనుకోకుండా ఒక దేవతా స్వరూపం సాక్షాత్కరించింది. నా అన్వేషణ ఆగిపోయింది. నా దృష్టి ఆ స్వరూపం మీద నిలిచిపోయింది. ఆ దేవతామూర్తి క్షణంలో మాయమై పోయింది. ఆ రూపంమీద ఉన్న నా తృష్ణ పట్టుదలగా మారింది. ఆ మూర్తిని నిర్మించలేక పోతే జన్మ వృథా అనుకున్నాను. ఆనాటి నా పూని! ఈనాటి నా కళకి శ్రీకారం. ఆనాటి నుంచి శిల్పకళా సరస్వతి కాలి మంజీరం నా ప్రాంగణంలో అవిచ్ఛిన్నంగా ఘల్లుమంటూంది. ఆ అనంత సౌందర్య రూప నిర్మాణం పూర్తి చెయ్యగలనో, లేదో అనే జిజ్ఞాసతప్ప అన్యచింత నాకు లేదు. వారాలూ, సంవత్సరాలూ, దశలూ గడిచాయి. ఇప్పటికి మూడు దశలు పూర్తి అయినట్టే నా దీక్ష ప్రారంభమై' అన్నాడు శిల్పి కొంచెం ఆవేశంతో.

కళిక ఆశ్చర్యంతో 'అయితే ఇప్పుడు నీ వను కున్న స్వరూప నిర్మాణం అంతా అయినట్టేనా?' అన్నది.

'ఇంకా కొద్దిగా తరువాయి ఉంది. కొన్ని మాసాల్లో పూర్తి కావచ్చు.'

'అయితే తెలియక అడుగుతాను. అంత దీక్షగా ఆ స్వరూపాన్నే నిర్మించాలనుకుంటూ, మళ్ళీ ఈ చిల్లర చిల్లర విగ్రహాలు ఎన్నో తయారుచేసి అమ్ముతా వెందుకూ?'

ఆ మాటకు శిల్పి చిన్నగా నవ్వుకున్నాడు. అది కళికకు అర్థం కాలేదు. సిగ్గుపడి, 'అలా అడక్కూడదా?' అంది.

'అడగొచ్చమ్మా! ఆ దేవతాస్వరూపం సాధారణమైన రాతితో సాక్షాత్కరించదు. విలక్షణమయిన ఒక రకపు నలుపురాయి మాత్రమే ఆ నిర్మాణానికి తగింది. కాని ఆ రాయి చాలా దుర్లభం. హిమాలయ ప్రాంతాల్లో, కొన్ని లోయల్లో ఎక్కడో అది దొరుకుతుంది. అంతే కాదు. దానిని నిర్మించే పనిముట్లు కూడా వేరే, మరి ఇవన్నీ సమకూర్చుకోవడానికి ఎంత ధనం కావాలి చెప్పు? అందుకు ఇదంతా!'

'ఓహో! అదా! అయితే ఆ రాయి ఎలా సంపాదించేవు? ఎన్నాళ్ళు పట్టింది?'

'కళికా! ఆ అపురూపమయిన శిల్ప సంపాదనకు

# శిల్పి

ధనం ఒక్కటే చాలదమ్మా! ఆత్మనిగ్రహం, దీక్ష ఉండాలి. అదికాకుండా విశేషంగా శారీరకమైన శ్రమపడాలి. కొన్ని సంవత్సరాలు చలికాలంలోతప్ప మిగతా కాలాల్లో హిమాలయ ప్రాంతాలు పర్యటించేను. ఆ గిరి కందరాల్లో పిచ్చివాడినై తిరిగేను. ఫలితం కనుపించలేదు.'

'ఓ మరేం చేసేవు?'

'లక్ష్మీ శిఖరం ఎక్కేను. అప్పటికి వారం రోజులు ఆహారం లేక కృశించడంచేత అక్కడ కొన్నాళ్ళుండిపోవలసివచ్చింది. తరువాత వాణీ శిఖరం చేరాను. అక్కడ ఫలపుష్పాలు సమృద్ధిగా ఉంటాయి. అక్కడ నేదదేరి సుమారు ఒక మాసం ధ్యానముద్రలో ఉండిపోయాను. మళ్ళీ అక్కడే ఒకనాడు ఆ దేవత గజ్జెల మోత వినిపించింది. నీ కాలి మంజీరాల సవ్వడికీ, ఆ మోతకీ ఏమంత భేదంలేదు. వెంటనే ఎంతో ఉత్సాహం కలిగింది. గౌరీ శిఖరానికి బయలుదేరాను. ఈ వాణీ, గౌరీ శిఖరాలమధ్య లోయలో ఒక దగ్గర చాలా కొద్దిగా, మూడు అంగుళాల లోతులో నీరు పారుతోంది. పాదమేనా మునగదు. ఆ నీటి అడుగున తళతళ మెరుస్తూ శిలాఫలకాలు కనుపించేయి. శిల్పకళాకాంత వశంవద అయిందనిపించింది. కొత్త చైతన్యం వచ్చింది. ఆనాటినుంచి దీక్ష వహించేను.'

కళిక విప్పారిన నయనాల్లో ఆశ్చర్యం వెల్లివిరిసింది.

'అయితే ఆ విగ్రహ నిర్మాణం కొద్దిలో ఉందంటున్నావు కదూ! ఇప్పుడు ధనం కూడా నీ దగ్గర సమృద్ధిగా ఉన్నట్టే ఉంది. ఇంక ఈ చిల్లర పనులు మానేసి ఆ పనే చేయరాదా?'

'కళికా! మహత్తరమైన కార్యాలు మన చేతిలో ఉండవు. ఆ విగ్రహ నిర్మాణం అన్ని వేళల్లోనూ కుదురదు. ఇరవై నాలుగు గంటల్లో కొన్ని సమయాల్లో మాత్రమే ఆ రాళ్ళు చేతికి



స్వేచ్ఛా జీవి

చిత్రం— చింతలపూడి అప్పలరాజు
(విజయనగరం)

లొంగుతాయి. రాత్రి 2 గంటలు మొదలు తెల్లవారుఝామున నాలుగున్నరగంటలవరకూ ఆ శిలల్లో ఒక రకమైన మెత్తదనం ఉంటుంది. అప్పుడే పని జరుగుతుంది. ఆ పుణ్యకాలం దాని క్రింద వినియోగించుకోకపోతే, ఆరోజంతా వృథా అన్నమాటే. ఆశ్చర్యం ఏమిటంటే ముప్ఫయి సంవత్సరాలలోనూ ఎంత పని చేసేనో, నువ్వు నా గుమ్మంలో కాలుపెట్టిన ఈ నాలుగైదు సంవత్సరాలలో నాలంత పని అయింది. ఒక్క ముంగురులు తీర్చడానికే పట్టింది మూడేళ్ళు. ముక్కుకి మరో సంవత్సరం తీసుకుంది. అలాంటిది నాలుగు సంవత్సరాలలో ఎంత పనయిందో తలుచుకుంటే నాకే ఆశ్చర్యంగా ఉంది. మళ్ళీ అప్పుడూ, ఇప్పుడూ కూడా నేను పనిచేసే కాలం రోజుకి రెండున్నరగంటలే.'

'మరి నేనంటే ఇంత గురి ఉంది కదా నీకు! ఒక్కసారి నాకా దేవతా స్వరూపాన్ని చూపించటాని కెందు కింత బాధ?'

'నీ దగ్గర నాకు అభ్యంతరం ఏమీలేదు, కళికా. నిజానికి, నీ వచ్చినుంచి నా పని ద్విగుణీకృతమైన ఉత్సాహంతో సాగుతూంది. దానికి కృతజ్ఞత ఎలా చెప్పను? పసిదానవు. నీకు కృతజ్ఞత చెప్పడం ఎలాగో నాకు తెలియకుండా ఉంది.'

'మరయితే ఎందుకు ఈ అభ్యంతరం? ఆ బొమ్మని చూడనీయరాదూ?'

'అసలు రహస్యం విను. ఆ విగ్రహ నిర్మాణంతో ప్రారంభమైన నా కళాకల్పవల్లి ఆ విగ్రహం పూర్తికాగానే ఆగిపోతుంది. ఆనాడు నేను ఈ పనిముట్లన్నిటినీ కొలనులో పారేయాలి. ఆ విగ్రహం పూర్తిచేసిన చేతితో ఇంకే బొమ్మనూ చెయ్యను. అంతపర్యంతం (అంటే అసంపూర్ణ స్థితిలో) దానిని ఎవరికీ చూపకూడదు' అని రుద్ధకంఠంతో కన్నీళ్ళు కార్చి, 'నువ్వు మాత్రం రావడం మానకు. విగ్రహ నిర్మాణం పూర్తి అయిన ఉత్తర క్షణంలో దానిని నీకు చూపిస్తాను' అన్నాడు.

'ఇదంతా తెలియక నిన్ను వేధించేను. క్షమించు' అని ఇంటికి వెళ్ళింది. కళిక ఆమె మనసులో ఎన్నో భావ పరంపరలు కదలిపోయాయి.

నాలుగు నెలలు గడిచాయి. కళిక వివాహం వైభవంగా ఒక జమీందారుతో జరిగింది. ఆమె అత్తవారింటికి వెళ్ళిపోతూ, పెళ్ళి బట్టలతో శిల్పి గృహానికి వచ్చింది. శిల్పి దుఃఖంలో క్రుంగిపోయాడు. కళిక వెళ్ళిపోతుందని తరుక్కు తరుక్కు విడుస్తున్నాడు. ఇదేమి అనుబంధమో అనుకుని దీవించాలని ప్రయత్నించేడు. నోట మాట రాలేదు. 'ఇంత వేగిరం వెళ్ళిపోతా వనుకోలేదు, కళికా! రెండు మూడు మాసాల్లో ఆ విగ్రహం పూర్తిచేసి నీకు చూపిద్దామనుకొన్నాను. ఇంక ఆ రెండు మూడుమాసాల్లో చేసే పని ఎన్ని సంవత్సరాలు పడుతుందో చెప్పలేను' అని పసిపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చాడు.

కళిక అపుకోలేని దుఃఖంతో తిరిగి తిరిగి

చూస్తూ వెళ్ళిపోయింది.

ఆమె తిరిగి వెళ్ళిపోతూంటే శిల్పికి ఈ భూచక్రం గ్రహాలతో సహా గిర్రున తిరిగినట్లయింది.

క్రమంగా దివారాత్రాలు రెండూ అతనికి ఒకటిగానే కనిపించాయి. ఆ విగ్రహ నిర్మాణ విషయం తప్పితే మరో పనిలేదు అతనికి. రాళ్ళు తేలేదు. బొమ్మలు చెక్కలేదు. అమ్మకాలు చెయ్యలేదు. లోపలి ప్రార్థనామందిరం నుంచి అతడు బయటికి వచ్చిన జాడ కనుపించలేదు.

కళిక అత్తవారింటికి వెళ్ళి పది సంవత్సరాలైంది. బాగా వికసించిన పువ్వులా ఉంది ఆమె రూపం. సంసార మాధుర్యం అంతా ఆమెదగ్గరే ఉంది. ఆమె ఆ ఇంటివారందరికీ ఒక దివ్య జ్యోతి. ఆమె రూపలావణ్యాలు వారి పూజా ద్రవ్యాలు. ఆమె వాక్కు వారికి బ్రహ్మ వాక్కు. కళిక భర్తకి, ఆమె కనుపించని క్షణం ఒక మహా యుగం. ఈ పదేళ్లలోనూ కళిక కొన్ని వందల సార్లయినా శిల్పిని గురించి తలుచుకుందేమో?

కళికకు ఒకనాడు అస్వస్థతగా ఉంది. ఇంట్లో అంతా కంగారుపడ్డారు. క్రమంగా ఆమె నీరసించి జ్వరంతో పాలిపోతూ వచ్చింది. కళిక భర్త ఆమెకు స్వయంగా సేవచేసి, మనసులో కోర్కె ఏదైనా ఉంటే చెప్పమని ప్రాధేయపడ్డాడు. కళిక మొదట కొంచెం సిగ్గుపడినా, కొంతసేపయాక నారాయణగడ్‌లో శిల్పి చేసిన విగ్రహాన్ని ఒక్కసారి చూడాలంది. వెంటనే ఆ జమీందారు కచేరికి వచ్చి ఆ విగ్రహాన్ని శిల్పితో సహా గౌరవంగా తెమ్మని మనుష్యులను పంపాడు, శిల్పికి సన్మానంచేసి గౌరవిద్దామనే ఊహతో. కాని ధూర్తుడైన అతని దివాను జమీందారు మనసు ఎరుగక దీని కింత అట్టహాసమా అనుకుంటూ రివ్వున బయలుదేరాడు.

అప్పటికి పది రోజులైంది శిల్పి విగ్రహాన్ని పూర్తిచేసి. సర్వసంగపరిత్యాగి శిల్పి రాత్రీ, పగలూ 'ఆ విగ్రహావలోకనంలో దేవలోకాన్ని దర్శిస్తున్నాడు. దివానుగారు పంపిన వస్తాదులు అమాంతం శిల్పి ఇంట్లో జొరబడ్డారు. శిల్పిని ప్రక్కకు త్రోసి విగ్రహాన్ని ఎత్తుకుపోతున్నారు. శిల్పి రుద్ధకంఠంతో వారిస్తూ విగ్రహానికి అడ్డుపడ్డాడు. వాళ్లు నిర్లక్ష్యంగా శిల్పిని త్రోసి విగ్రహాన్ని పట్టుకు నడుస్తున్నారు. ముందు వాళ్లూ, వెనుక శిల్పి. అరవై గజాల దూరం పరుగెత్తారు. శిల్పి శక్తిహీనుడై క్రిందపడిపోయాడు. విగ్రహం అమాంతం వారి చేతుల్లోంచి జారి క్రిందపడి భూమికి అతుక్కుపోయింది. ఎందరు కుస్తీలు పట్టినా అది కదల్లేదు. ఇంత జరిగినా విగ్రహం తాలూకు ముసుగు చెక్కుచెదరలేదు.

ఈ వార్త శరవేగంగా జమీందారుకు చేరింది. జమీందారు చాలా పశ్చాత్తాపపడ్డాడు. నీరస స్థితిలో ఉన్న కళిక ఈ వార్త విని గుండె బాదుకుంది. ఆ శిల్పితో కూడా విగ్రహం సగౌరవంగా వస్తుందనుకుందే కాని, శిల్పి ఇలా తన మూలంగా బలి అయిపోతాడనుకోలేదు. భర్తతో ఎలాగైనా ఆ స్థలానికి వెళ్ళాలంది. జమీందారు పట్టుపరుపుల పల్లకీలో కళికని భద్రంగా ఉంచి, సపరివారంగా ఆ శిల్పి పడిన ప్రాంతానికి తెచ్చాడు. కళిక నెమ్మదిగా లేచి శిల్పి సమాధిని కన్నీళ్ళతో అభిషేకించి, వణికే చేతులతో ఆ విగ్రహం తాలూకు వస్త్రాన్ని తొలగించింది. ఆ విగ్రహ రామణీయకం చూచింది. కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. ఆ కాంతి భరించలేక పోయింది. ఏదో మైకం క్రమ్మింది. చూచేవాళ్ళకు ఇద్దరు కళికలు అక్కడ ప్రత్యక్షమయ్యారు. విగ్రహంలో జీవకళ ఉట్టిపడి మనుష్యుల్లో భ్రాంతి కల్పిస్తూంది. కళిక మైకంలో స్తంభించిన విగ్రహమౌతున్నది. ఏది విగ్రహమో, ఏది మనిషో తెలియలేదు. కొన్ని క్షణాల్లో ఈ సందేహం తీరిపోయింది. కళిక కర్పూర కళికలా వెలిగి ఆ విగ్రహంలో కలిసిపోయింది. కొంతసేపయాక కొందరు విగ్రహంలో కళిక కలిసిందన్నారు. మరికొందరు కళికలో విగ్రహం లీనమయిందన్నారు. ఏమైనా అక్కడ ఉన్నది ఒక్కటే. కొందరికి అది కళికలాంటి విగ్రహం. మరికొందరికి విగ్రహంలాంటి కళిక.

ఈ సంఘటన జరగటానికి కొంతకాలం ముందు కళిక ఒక ఆడశిశువును ప్రసవించింది. శిల్పి అక్కడ విగ్రహం పూర్తి చేయడం, కళిక ఇక్కడ ప్రసవించి క్షీణించడం ఒక్కసారే ప్రారంభమయాయి. ఇప్పుడు వాళ్ళందరికీ ఆ పాపే కళిక.

అమ్మా! జ్యోతీ! ఆ వృద్ధ శిల్పి ప్రాంగణం అంతా ఇప్పుడు పాడుబడి ఉంది. చూచేవు కదూ నిన్న? ఆ విగ్రహం అక్కడే ఉంది పట్టు వస్త్రపు ముసుగులో. ఈ శిల్పి గృహంలోనూ, ఆ ప్రాంతంలోనూ ఎప్పుడూ ఇప్పటికీ సుత్తి దెబ్బలూ, రాళ్ళ చప్పుళ్ళూ వినిపిస్తూనే ఉంటాయి. ప్రతి తెల్లవారు ఝామునా అక్కడ కొన్ని వందలమంది కూలీలు పనిచేసే సందడి వినిపిస్తుంది. అంతే కాదు. పన్నెండు పదమూడు సంవత్సరాల బాలిక కాలి మంజీరాల సవ్వడి మనోహరంగా అప్పుడప్పుడు వినిపిస్తుంది. శిల్పి పడిపోయిన దగ్గరినుంచి ఆ విగ్రహానికి ఇదేవిధంగా అక్కడ ఉత్సవం జరుగుతూంది. ఆ దేవత చలువవల్ల ఆ దేశం సుభిక్షంగా ఉంటుంది.

ఆ కొలనులో తామర పూవులు ఎప్పటికీ వాడవు. ఆ విగ్రహం ఎన్నటికీ కాంతి తరగదు. ఆ ప్రాంతంలో ఎప్పుడూ ఒక గడ్డిపరకైనా మొలవదు. విన్నావా, తల్లీ!"

"నాన్నగారూ! అయితే శిల్పి కళిక విగ్రహాన్నే తయారుచేసేడన్నమాట."

"అవునమ్మా! అది కళిక విగ్రహమే. కాని ఆ విగ్రహం కళిక పుట్టడానికి ముప్ఫయి సంవత్సరాలకు పూర్వమే అతడు చేయడం ప్రారంభించాడు. అది కళిక విగ్రహమని అతనికి కూడా తెలియదు. కళిక పదమూడు సంవత్సరాల ప్రాయంలోనే అత్తవారింటికి వెళ్ళిపోవడంచేత ఆమెకు అది తన విగ్రహమని ఆఖరి వరకూ తెలియదు. ఆ శిల్పికి సాక్షాత్కరించిన దేవత కళికగా పుట్టి, అతన్ని హెచ్చరించి, ఆ జమీందారుని వివాహం అనే రూపంలో కూడి, శాశ్వతంగా ఈ ఉత్సవం చేయమని శాసించిందని అక్కడి ప్రజల అభిప్రాయం. అందుకే అక్కడ విగ్రహ నిర్మాణం పూర్తిఅయేసరికి ఇక్కడ ఈమె నీరసించిపోయింది. ఏమైనా, ఆ దేవత కళికా, ఆ అమరజీవి శిల్పాచార్యుడూ కారణ జన్ములు."

"నాన్నగారూ! మరి ఆ శిల్పి తన ప్రార్థనా



అప్సరస

శిల్పం-ఎ. కె. శేషగిరిరావు (బొంబాయి-19)

మందిరంలోంచి ఏవో వస్తువులు తెచ్చి కొలనులో వేస్తే అవి తామర పూలెందు కయాయి! అవి ఇంకా నిన్న మనం చూసేముకదా! వాడలేదేమి?"

"అవునమ్మా! ఆ విగ్రహం చెక్కుతూంటే రాలిన రాళ్ళముక్కలు. వాటి నెవరూ తొక్కకూడదు. అవే పూవులయేయి. ఎందు కవి పూవులయేయో, ఎందుచేత వాడలేదో నాకూ తెలియదు."

"నాన్నా! మరి కళిక కన్నపాప ఇంకా ఉందా?"

"ఉందమ్మా! ఆ పాపవి నీవే తల్లీ! ఆ కళికని దక్కించుకోలేని నిర్భాగ్యుడూ, అజ్ఞాతంగా శిల్పిని బాధించిన దుర్మార్గుడూ అయిన ఆ జమీందారుణ్ణి నేనేనమ్మా!" ★